క్లుప్తంగా

డిసెంబర్ 1న దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం

మిర్యాలగూడ టౌన్ : దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనాన్ని డిసెంబర్ 1న హైదరాబాద్‌లో డిఫరెంట్లీ ఏబుల్ వెల్ఫేర్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు బంటు నాగేందర్, జిల్లా ఇన్‌చార్జ్ ఉప్పల సురేంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరుకావాలని, దివ్యాంగుల శక్తి ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు దివ్యాంగులు భారీగా తరలిరావాలని పిలుపు నిచ్చారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా శివ



గుర్రంపోడు : ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన బచ్చన బోయిన శివ రెండోసారి ఎన్నికయ్యారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో గోరఖ్‌పూర్‌లో నిర్వహించిన 70వ ఏబీవీపీ జాతీయ మహాసభలో శివ ఎన్నికైనట్లు ఆ సంఘం మండల శాఖ తెలిపింది. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టి విద్యార్థులు నిరుద్యోగుల కోసం కృషిచేస్తానన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన శివను పలువురు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : మండలంలోని యాచారం సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ధనరాజ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాచారం సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 33/11కేవీ ఫీడర్, 11కేవీ ఇండస్ట్రీయల్ ఫీడర్, 11కేవీ మారేపల్లి ఫీడర్ పరిధిలోని బాలాజీ రైస్ మిల్, ఇండస్ టవర్ పరిధిలో 400కేవీ కొత్తలైన్ వేస్తున్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 33/11కేవీ పరిధిలో ఫీడర్ కింద విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. యాచారం సబ్‌స్టేషన్, మారేపల్లి ఫీడర్‌లో బాలాజీ రైస్ మిల్లు, ఇండస్ టవర్, మారేపల్లి, కేకే కాల్వ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ గృహ, వాణిజ్య, పరిశ్రమ, వ్యవసాయ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి, అధికారులకు సహకరించాలని కోరారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీటీం బృందం

పెద్దవూర : ఈవ్‌టీజింగ్ పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ షీటీం ఏఎస్ఐ తబితా అన్నారు. సోమవారం పెద్దవూర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేర సమచారాన్ని అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బాలోజీ, వార్డెన్ కొల్లు బాలకృష్ణ, టీచర్లు సురేందర్, సైదులు, సంధ్య, శాంతి. జ్యోతి,రామయ్య., శ్రీను నాయక్ పాల్గొన్నారు.

'సింహగర్జన' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి(చింతపల్లి) : డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'హలో మాల.. చలో హైదరాబాద్ సింహగర్జన పోస్టర్‌ను సోమవారం చింతపల్లి మండలంలోని తీదేడు గ్రామంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గదరి జంగయ్య, రాష్ట్ర కన్వీనర్ నల్లవెల్లి సంజీవ, గంటల ఆంజనేయులు, నల్లవెల్లి సైదులు, గంటల మల్లయ్య, గంటల రామనందం తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలి

హాలియా : కాంగ్రెస్ రాష్ట్ర నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న తీన్మార్ మల్లన్న తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని సాగర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు బొంగరాల ఏసురాజు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రజాస్వామ్య పద్ధతిలో కులాలకు, మతాలకు అతీతంగా పోటీ చేసి పార్టీ ఓట్లతో ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలిచాడని తెలిపారు. తీన్మార్ మల్లన్న కుల రాజకీయాలకు తెరలేపి బీఆర్ఎస్ పార్టీ వాళ్లు రాసిన స్క్రిప్ట్ చదువుతూ జానారెడ్డిపై విమర్శలు చేయడం తన స్థాయికి తగదని పేర్కొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే!

- రోడ్డును ఆనుకొని ప్రమాదకరంగా ఏఎమ్మార్పీ వరద కాల్వ
- రక్షణ గోడను ఏర్పాటు చేయాలని వాహనదారుల వేడుకోలు



రోడ్డు వెంట రక్షణ గోడ లేకుండా ఉన్న కాల్వ

పెద్దవూర : మండలంలోని తుంగతుర్తి సమపంలో ఏఎమ్మార్పీ లోలెవల్ వరద కాల్వకు రక్షణ గోడ లేదు. దీంతో వాహనదారులు ఏ కొద్దిపాటి అలసత్వం ప్రదర్శించినా, ఆదమరిచినా ఇక అంతే సంగతులు. నేరుగా వెళ్లి కాల్వలో పడాల్సిందే. నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై గల తుంగతుర్తి స్టేజీ నుంచి గ్రామానికి వెళ్లే రహదారిని బీటీ రోడ్డుగా మార్చారు. మండల కేంద్రం నుంచి గ్రామానికి వెళ్లడానికి ఈ రహదారే దగ్గరగా ఉంటుంది. దీనికితోడు చింతపల్లితండా, రామన్నగూడెం గ్రామస్తులు సైతం ఇదే దారి నుంచి వెళ్తుంటారు. గ్రామ సమీపంలో ఉన్న వరద కాల్వపై నిర్మించిన వంతెన సమీపంలో నుంచి ఈ రహదారి వెళ్తుంది. ఇక్కడ ఎల్ ఆకారంలో మూలమలుపు ఉంది. దీనికి తోడు రహదారి బీటీ అంచుదాక కాల్వ లైనింగ్ కోతకు గురై మట్టి తేలింది. ఈ రహదారిపై కొత్త వాళ్లు డ్రైవింగ్ చేస్తే వాహనం వేగంగా ఉంటే ప్రమాదం చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వాహనదారులు ఇక్కడ ఏమాత్రం ఎమరుపాటు ప్రదర్శించిన వాహనం అతివేగంగా వచ్చి అదుపు తప్పినా నేరుగా కాల్వలో పడిపోవాల్సిందే. కనీసం ఇక్కడ ఎలాంటి రక్షణ గోడను గానీ, ప్రమాద హెచ్చరిక బోర్డులు గానీ ఏర్పాటు చేయలేదు. ఈ రహదారిపై నిత్యం ఆటోలు, పాఠశాల బస్సులు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు అధిక సంఖ్యలో వెళ్తుంటాయి. అధికారులు సత్వరమే స్పందించి మూలమలుపు వద్ద రక్షణ గోడను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కాల్వ ఉన్నట్లు కూడా తెలియదు



పెద్దవూర నుంచి గ్రామానికి వచ్చే దారిలో ఏఎమ్మార్పీ లోలెవల్ వరద కాల్వ దగ్గరకు వచ్చేదాకా కనిపించదు. వాహనం వేగంగా ఉన్నా, అదుపు తప్పినా, ఏమాత్రం ఎమరుపాటు ప్రదర్శించినా నేరుగా కాల్వలో వాహనంతో పాటు పడిపోవాల్సిందే. దీనికితోడు కాలువ అంచుల వెంట కంపచెట్లు పెరిగి ఈ ప్రదేశంలో కాలువ ఉన్నట్లు కూడా తెలియని పరిస్థితి ఉంది. కొత్తవారు డ్రైవింగ్ చేస్తే ప్రమాదకరమే. గ్రామానికి ఆటోలు, స్కూల్ బస్సులు, కార్లు సైతం వస్తుంటాయి.

– రావుల వేణుగోపాల్, తుంగతుర్తి

ఏఎమ్మార్పీ అధికారులకు విన్నవించాం



గ్రామ సమీపంలోని ఏఎమ్మార్పీ లోలెవల్ వరద కాల్వ వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంటుంది. మండల కేంద్రం నుంచి తుంగతుర్తి గ్రామస్తులతో పాటు చింతపల్లితండా, రామన్నగూడెం తదితర గ్రామాల వాహనదారులు ఇదే దారి గుండా వెళ్తుంటారు. గ్రామ సమీపంలో ఉన్న వరద కాలువ వద్ద ప్రమాదకరమైన ఎల్ ఆకారపు మూలమలుపు ఉండి, రోడ్డు బీటీ అంచులదాక కుంగిపోయి ఉంది. ఏ ఎమ్మార్పీ అధికారులకు సైతం ప్రమాదకరంగా ఉన్న ప్రదేశంలో రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని విన్నవించాం. ఈ ప్రదేశంలో రక్షణ గోడలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి.

– మెండె సైదులు, తుంగతుర్తి

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

- సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



హాలియా : మార్కెట్ పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

త్రిపురారం : రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి నిడమనూరు మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సూచించారు. సోమవారం నిడమనూరు మండల కేంద్రంలోని నిడమనూరు మార్కెట్ యార్డులో నిర్వహించిన మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోల్లు సక్రమంగా జరిగే విధంగా చూసుకోవాలన్నారు. సన్న రకం ధాన్యానికి బోనస్ అందుతుందా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు, పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

హాలియా : రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ మార్కెట్ పాలక మండలి సభ్యులు పని చేయాలని సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం హాలియా పట్టణంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన పాలక మండలి మొదటి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ పాలక మండలి సభ్యులంతా కలిసికట్టుగా ఉండి రైతులు పండించిన ధాన్యం అపరాలు, పత్తి తదితర పంటలకు ప్రభుత్వం అందించే మద్దతు ధర రైతులకు అందేలా చూడాలన్నారు. మార్కెట్ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో రూ.5కోట్లతో మార్కెట్ యార్డ్‌లో సీసీ డ్రెయినేజీలు, అదనపు మార్కెట్ గోదాములు, పెద్దవూర సబ్ యార్డులో కమర్షియల్ కాంప్లెక్స్ ఏర్పాటు, మట్టిని నింపడం, తిరుమలగిరి సబ్‌యార్డులో వేబ్రిడ్జి ఏర్పాట్లపై చర్చించి పాలకమండలి సభ్యులు ఆమోదించారు. అదే విధంగా కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, తెట్టెకుంట గోదాం వరకు రోడ్డు ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమనరేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రఘు, సెక్రటరీ వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు ఈదయ్య, గౌస్, రఘు, మంగమ్మ, రాము, శంకర్, పాండునాయక్, లక్ష్మయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బాలల మేధో వికాసానికి చదరంగం పదును

మిర్యాలగూడ : బాలల మేధో వికాసానికి చదరంగం పదును పెడుతుందని సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. సోమవారం పట్టణంలోని రెడ్డి కాలనీ ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంక్ సమీపంలో డైమండ్ చెస్ అకాడమిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యతోపాటు చిన్నారులు చెస్‌లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి దివ్యశ్రీ మాశెట్టితో కొద్దిసేపు ఆయన చెస్ ఆడారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు, మీల్స్ ఆన్ వీల్స్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ మాశెట్టి శ్రీనివాస్, మాశెట్టి గీత, మాశెట్టి ధర్మతేజఅఖిల, బింద శ్రీ దర్శిని తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారిణితో కలిసి చెస్ ఆడుతున్న సబ్ కలెక్టర్

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

మిర్యాలగూడ అర్బన్ : కార్మికుల హక్కులను కేంద్రం ప్రభుత్వం కాలరాస్తుందని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్, రైతు సంఘం వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ మంగళవారం మండల కేంద్రాల్లో నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4లేబర్ కోడ్‌లను తీసుకురావాలని కేంద్రం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర కమిటీ పిలుపు మేరకు చేపడుతున్న నిరసన కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో విజయవంత చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మల్లు గౌతంరెడ్డి, రామ్మూర్తి, సయీద్, నర్సిరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

మసీద్ కమిటీకి ఎన్నికలు నిర్వహించాలని వినతి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో మాట్లాడుతున్న ముస్లింలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ వక్ఫ్‌బోర్డు మసీద్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ సోమవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలకు మసీద్ ఏ సరాయి మీరాలమ్ పెద్ద మసీద్ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలోని వక్ఫ్‌బోర్డు హైదరాబాద్ పరిధిలోని అతి పురాతనమైన మసీద్ ఏ సరాయి మీరాల్ కమిటీ కార్యవర్గం ఈ నెల 16న ముగిసిందని, గత 30 ఏళ్లుగా మసీద్ కమిటీ ఎన్నికలను నిర్వహించడం లేదని, ఈ విషయంపై ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజాస్వామ్యయుతంగా మసీద్ కమిటీ ఎన్నికలను నిర్వహించాలని ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఖాజాహామీదుద్దీన్, మహ్మద్ అస్లాం, ఖాజానాజీముద్దీన్, కౌన్సిలర్ జానీ, నాయకులు అబ్దుల్లా, సలీం, ఆరీఫ్, ఎండీ అంజద్, అయూబ్, సమీఖాద్రి, ముజీబ్, మోహిద్, నాజీం, జమీర్, నాహీద్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ విశ్వవిద్యాలయాల జాతీయ కన్వీనర్‌గా బాలకృష్ణ



కొండమల్లేపల్లి(చింతపల్లి) : చింతపల్లి మండలంలోని వర్ధమానిగూడెం గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన కసుకటి బాలకృష్ణ ఏబీవీపీ కేంద్ర విశ్వవిద్యాలయాల కార్యాలయాల జాతీయ కన్వీనరర్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కేంద్ర విశ్వవిద్యాలయంలో జర్నలిజంలో పీహెచ్‌డి చేస్తున్న బాలకృష్ణ ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మెనూ పాటించకపోతే చర్యలు తీసుకుంటాం



నిడమనూరులో ఎస్టీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఏఎస్‌డబ్ల్యూఏఓ వెంకట కృష్ణ

త్రిపురారం : సంక్షేమ హాస్టళ్లలో మెనూ సక్రమంగా పాటించాలని, లేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఏఎస్‌డబ్ల్యూఏఓ వెంకట కృష్ణ అన్నారు. సోమవారం నిడమనూరు మండల కేంద్రంలోని ఎస్సీ బాలురు, బాలికల సంక్షేమ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్ల పరిసరాలను పరిశీలించి పిచ్చి మొక్కలు, కంప చెట్లు తొలగించి శుభ్రం చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు ప్రభుత్వం నుంచి విద్యార్థులకు వచ్చే బిల్లులను తప్పసరిగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ జానీమియా, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నమాదిగ, పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వద్ద స్థానికుల ధర్నా



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



డంపింగ్ యార్డులోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో బారులుదీరిన చెత్త సేకరణ వాహనాలు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రాంనగర్ బంధం సమీపంలోని డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్వాసన, పొగతో ఇబ్బందులు పడుతున్నామని సోమవారం ఆ డంపింగ్ యార్డు గేటు వద్ద చెత్త సేకరణ వాహనాలను లోనికి వెళ్లకుండా స్థానికులు అడ్డుకొని ఆందోళనకు దిగారు. రాంనగర్ బంధం, పద్మావతినగర్, బాధలాపురం, గుడూరు, ఈదులగూడెం ఏనే, అవంతిపురం తదితర ప్రాంతాలు మొత్తం పొగతో కమ్ముకుంటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆ చెత్త వాహనాలు ఉదయం 6గంటల నుంచి 11:30గంటల వరకు బయటే నిలిచిపోయాయి. కమిషనర్ డంపింగ్ యార్డు వద్దకు వచ్చి సమాధానం చెప్పాలని అక్కడికి చేరుకున్న పర్యావరణ పరిరక్షణ ఇంజనీర్ శ్వేతారెడ్డికి వివరించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి డంపింగ్ యార్డు వద్దకు చేరుకున్నాడు. దీంతో స్థానికులు చెత్తకు నిప్పు పెట్టడంతో దుర్వాసన, ఇల్లు పొగతో నిండుకుంటున్నాయని, దీంతో తాము రోగాల బారిన పడుతున్నామని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని, తనపై నమ్మకం ఉంటే ఆందోళన విరమించాలని కోరారు. దీంతో స్థానికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, యాదగిరి, సాయి, నవీన్, శివ, కొండయ్య, ప్రవీణ్, శ్రీను, గిరి, ప్రభాకర్, అంజి, ర వి, శ్రీను, లక్ష్మారెడ్డి, సైదులు, నరేష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తయారీలో జాగ్రత్తలు అవసరం



విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న ఎంఈఓ

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం తయారీలో జాగ్రత్తలు పాటించాని ఎంఈఓ లావురి బాలు అన్నారు. సోమవారం మిర్యాలగూడ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో క్వాలిటీతో కూడిన సరుకులు వాడాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన షూస్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేరకొండ : అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. 'ధర్తి ఆబ జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా సోమవారం దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజన తండాలు, ఆవాసాల్లో రోడ్లు, మంచినీటి వసతి, విద్య, వైద్యం, విద్యుత్, టెలికాం వంటి సౌకర్యాలు ధర్తి ఆబ కార్యక్రమంలో భాగంగా కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈ లింగారెడ్డి, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, ఎంపీడీఓ డానియల్, కొర్ర గౌతమిరాంసింగ్ సీత్యానాయక్, కొర్రపాండు తదితరులు పాల్గొన్నారు.

డిండి : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఏనకుంట, డాక్యతండా వద్ద కొనసాగుతున్న బీటీరోడ్ల పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేపసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రూ. 2లక్షల వరకు రుణమాఫీ జరుగుతుందని, త్వరలోనే ప్రభుత్వం రైతు భరోసా కూడా అందిస్తుందన్నారు. అనంతరం చెర్కుపల్లి గేటు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సాయి లక్ష్మీ పారాబాయిల్డ్ రైస్ మిల్లును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ యాదవ్, గడ్డమీది సాయి కుమార్, మేకల కాశన్న, నూకం వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్, లక్పతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ- సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి వేణు

మిర్యాలగూడ టౌన్ : స్థానిక కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ–సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి జి. వేణు, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీఎస్ఎన్ సుమబాల అన్నారు. సోమవారం ఈ–సేవా కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ సేవా కేందారలు సాధారణ ప్రజలు, న్యాయ వ్యవస్థ మధ్య ఉన్న దూరాన్ని తగ్గిస్తుందన్నారు. ఈ-కోర్టు సేవల ద్వారా డిజిటల్ రూపంలో అందుబాటులో ఉన్న అన్ని ఇతర సేవల గురించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. ట్రాఫిక్ చలాన్లు, చిన్న నేరాలకు సంబంధించిన జరిమానాల చెల్లింపులను ఆన్‌లైన్‌లో కట్టుకునేందుకు వీలు ఉంటుందన్నారు. ఉచిత న్యాయ సేవలను ఎలా పొందాలనే విషయంలో ప్రజలకు మార్గనిర్దేశితత్వం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కోశాధికారి పవన్‌కుమార్, గోదాల వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్రహీం, ఏచూరి శ్రీనివాస్, గూడూరు శ్రీనివాస్‌రావు, లింగపల్లి శ్రీనివాస్, నేతి సత్యనారాయణ, మల్లేష్, భాస్కర్, బహునూతల వేణుగోపాల్‌రావు, కొంక వెంకన్నలతో పాటు జూనియర్, సీనియర్ న్యాయవాదులు తదితరులున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



శ్రీదత్తాత్రేయ స్వామికి మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

త్రిపురారం : మండల కేంద్రంలో అడవి దేవులపల్లిలో శ్రీ కొదండ రామ చంద్ర స్వామి ఆలయం ఏదురుగా నిర్మించిన ఆలయంలో శ్రీదత్తాత్రేయ, శ్రీవినాయక స్వామి వార్ల విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు జీడికంటి నరేంద్రచార్యుల ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి హరే రామ ఏకనామ జపంతో నూతన విగ్రహాలకు హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం బ్రహ్మ ముహూర్తంలో ఆలయంలో శ్రీదత్తాత్రేయ, శ్రీవినాయక విగ్రహాలను శ్రీదత్తాత్రేయ భక్త బృదం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా సాగర్ ఎమ్మెల్యే జయవీరెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఎమ్మెల్యేకు ఆశీర్వాదం అందించారు. పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సుమారు 2500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమలో గ్రామ పెద్దలు, పలు రాజకీయ పార్టీల నాయకులు, భక్త బృదం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలని నేడు మహాధర్నా

మిర్యాలగూడ టౌన్ : పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అహ్మద్‌ఖాన్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానికంగా చలో హైదరాబాద్ కార్యక్రమ ప్రచార కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు టి. సురేష్, ఎం. నాగరాజు, డి. సైదులు, ఎండి ఖలీం, చైతన్యరెడ్డి, మధన్, దినేష్, ఎస్‌కె గాలిబ్ ఉన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

త్రిపురారం : నిడమనూరు మండలంలోని ఇండ్ల కోటయ్య గూడెం శివారులోని శ్రీ కోట మైసమ్మ ఆలయంలో వార్షిక బ్రహోత్సవాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. ఆలయ ఫౌండర్ చౌటీ ఆంజనేయులు పద్మ దంపతుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో సోమవారం బలిహరణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మెక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ నవీన్ కుమార్, పూజారి పద్మ, రమణయ్య, రాజు, యాదయ్య, శ్రీనివాస్, కోటయ్య, వెంకన్న పాల్గొన్నారు.



బలిహరణ కార్యక్రమంలో పూజారులు, భక్తులు

పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలి



విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

దేవరకొండ : పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని దేవరకొండ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ అన్నారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ ఆర్థిక సహకారంతో ప్రతి రోజూ సాయంత్రం స్నాక్స్ అందించేందుకు ముందుకు వచ్చారు. సోమవారం విద్యార్థులకు ఆయన స్నాక్స్ అందజేసి మాట్లాడారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రతి రోజూ సాయంత్రం విద్యార్థులకు స్నాక్స్ అందించనున్నట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన వడ్త్య రమేశ్‌కు పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవర్ధన్, రవి, బక్కయ్య, కొర్ర లోక్యానాయక్, నాగరాజు, పండరినాథ్, శ్రీపతిరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్ చౌదరి

త్రిపురారం : విద్యార్థి దశ నుంచే వ్యక్తిత్వ వికాసంతోపాటు సంస్కారమైన చదువును విద్యార్థులు అలవర్చుకోవాలని విశ్వమానవత సంస్థ వ్యవస్థాపకులు శ్రీనివాస్ చౌదరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విద్యానగర్ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ.. సమాజంపై బాధ్యత కలిగిఉండి సేవాభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఉన్నతమైన చదువుతో విలువలు కలిగి ఉండి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చల్లా రవి కుమార్, ఉపాధ్యాయుల వీరా రెడ్డి, శ్రీనయ్య, విష్ణు కుమార్, వెంకట్, సదా నాయక్, లక్ష్మీ నర్సయ్య, పద్మ, పద్మావతి, ఏడుకొండల్, సరోజ పాల్గొన్నారు.